క్లుప్తంగా

వంశీమోహన్ ఎన్నికల ప్రచార రథం సిద్ధం



గన్నవరం: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ఎన్నికల ప్రచార రథం సిద్ధమైంది. ప్రచార వాహనానికి ముందు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వంశీమోహన్ చిత్రాలను ఏర్పాటు చేశారు. వాహనానికి ఇరువైపులా మహానేత వైఎస్సార్, ఎన్టీఆర్, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, మాజీ ఉపప్రధాని బాబుజగ్జీవన్‌రామ్, సామాజిక కార్యకర్త జ్యోతిరావ్‌పూలే, వంశీకి అత్యంత ఆప్తుడైన జూనియర్ ఎన్టీఆర్ ఫోటోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రచార రథంలో జనరేటర్, సౌండ్ సిస్టమ్, ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

పెనమలూరు: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప శ్రీనివాస నగర్ కాలువ కట్టకు చెందిన సింహాద్రివెంకటేశ్వరరావు కానూరు వసంతనగర్ వంతెన వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

మరో ఘటనలో..

కంకిపాడు: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని కంకిపాడు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల మేరకు.. కంకిపాడు గ్రామశివారు ప్రాంతంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేశారు. పుట్లపల్లి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి వద్ద ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



పెనమలూరు: చోడవరం గ్రామ పరిధి కృష్ణానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ, పోలీసు అధికారులు సీజ్ చేశారు. రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాలు.. చోడవరం ఇసుక క్వారీ నుంచి ఇసుక మాఫియా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని అందిన సమాచారంతో గురువారం రాత్రి ఆర్ఐ భరద్వాజ్, ఎస్ఈబీ, పెనమలూరు పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో నదిలో ఇసుక లోడ్ చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు పారిపోయారు. ట్రాక్టర్లను పెనమలూరు తహసీల్దార్ కార్యాలయం వద్దకు తీసుకువచ్చి సీజ్ చేశారు. ట్రాక్టర్ నంబర్ల ఆధారంగా వాటి యజమానులు కొడాలి విష్ణువర్ధనరావు, అన్నే వెంకటేశ్వరరావులుగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

అత్తింటివారిపై వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం చోడవరం వాటర్ ట్యాంకు ప్రాంతానికి చెందిన చోరగుడి ప్రశాంతి 2015వ సంవత్సరంలో చినపారుపూడికి చెందిన డానియేలును పెద్దల సమక్షంలో కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. భర్త వంట మేస్త్రీగా పని చేస్తాడు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. కాగా భర్త దురలవాట్లకు బానిసగా మారి అదనపు కట్నం తీసుకురమ్మని భార్యను వేధించసాగాడు. భర్తతో పాటు అత్త బాయమ్మ, ఆడపడుచు చదువుల వజ్రం, ఆమె భర్త కోటయ్య, పెద్ద ఆడపడుచు కుమారుడు కె.అవినాష్‌లు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయలు అవ్వడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కంకిపాడు మండలం పునాదిపాడుకు చెందిన ఎస్.వీరవెంకటశ్రీనివాసరావు తన బైక్‌పై విజయవాడకు వెళ్లాడు. విజయవాడలో పని ముగించుకుని తిరిగి బైక్‌పై వస్తూ కానూరు పంటకాలువ రోడ్డు జంక్షన్ వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన లారీ అతడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతని కాలుకు తీవ్ర గాయమవ్వడంతో స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

- కంకిపాడు వేళంగణీమాత ఆలయంలో మంత్రి జోగి రమేష్ ప్రార్థనలు
- క్రీస్తు విశ్వాసుల సిలువ మార్గం

కంకిపాడు: గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని క్రీస్తు విశ్వాసులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా విశ్వాసులు కంకిపాడు ప్రధాన సెంటరులో సిలువ మార్గం నిర్వహించారు. క్రీస్తు, మరియమాతను ఆరాధిస్తూ గేయాలు ఆలపించారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి: మంత్రి జోగి రమేష్

రాష్ట్రంలోని యావన్మంది ప్రజలు, సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందరూ సుభిక్షంగా ఉండాలని ప్రతీ ఒక్క విశ్వాసి ప్రార్థనలు చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. కంకిపాడులోని వేళంగణీమాత దేవాలయంలో మంత్రి జోగి రమేష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ ఎం.సాల్మన్‌రాజు ప్రార్థనలు జరిపించారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ, శాంతి మార్గాల్లో పయనించాలన్నారు. క్రీస్తు బోధనలు పాటించి, సమాజ అభ్యున్నతిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, ఏఎంసీ వైస్‌చైర్మన్ మాదు వసంతరావు, సర్పంచ్ బాకీ రమణ, ఎంపీటీసీ సభ్యులు చిట్టూరి ప్రసాద్, కోనా కిషోర్, బేతపూడి సురేష్, టిడ్కో, ఉమెన్ ఫైనాన్స్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్లు పి.రాఘవరావు, నందిపాటి బిందుమాధవి, రామినేని రమాదేవి, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, సీహెచ్‌సీ చైర్మన్ మేదండ్రావు కుటుంబరావు, సర్పంచ్‌లు మేరుగు విజయచంద్రశేఖర్, సీహెచ్ సురేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక జ్యోతి నగర్ ఆర్సీఎం చర్చి, సీఎస్ఐ చర్చి, హోసన్నా మందిర్, కారుణ్య ప్రార్థన మందిరం, బేతేలు చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు అధిక సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు. శోభనాద్రీపురం, బండారుగూడెం సీఎస్ఐ చర్చిల్లోనూ ప్రార్థనలు నిర్వహించారు. జ్యోతినగర్ ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్ ప్రధాన రహదారుల్లో ఏసుక్రీస్తు సిలువను మోస్తూ, గీతాలను ఆలపిస్తూ ప్రదర్శన చేశారు. ఫాదర్ చేబ్రోలు జోసఫ్ తంబి, జేఎంజే సిస్టర్లు పాల్గొన్నారు.



కంకిపాడు ఆర్‌సీఎం చర్చిలో క్రీస్తు విశ్వాసులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్



హనుమాన్‌జంక్షన్‌లో సిలువ మోస్తున్న జేఎంజే సిస్టర్స్



ఉయ్యూరులో క్రీస్తు విశ్వాసుల సిలువ మార్గం

నున్న(విజయవాడరూరల్): గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకొని నున్న సీఎస్ఐ చర్చిలో డీసరీ చైర్మన్ కె.జాన్‌వెస్లీ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు బైబిల్ మాటలను వివరించారు. అలాగే ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో బోడపాడు నుంచి నున్న చర్చి వరకు సిలువ యాత్ర నిర్వహించారు. పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో క్రీస్తును ఆరాధిస్తూ ప్రార్థనలు చేశారు. సిలువ మార్గం చేపట్టి క్రీస్తు గేయాలను ఆలపించారు. పలు మందిరాల్లో జరిగిన ప్రార్థనల్లో మంత్రి జోగి రమేష్ సతీమణి శకుంతలాదేవి పాల్గొని గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని ఆర్సీఎం ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో సిలువ మార్గం ఉయ్యూరు ప్రధాన సెంటర్ వరకూ నిర్వహించారు. ఫాదర్ మద్దాల వరప్రసాద్ క్రీస్తు సందేశం ఇచ్చారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ సోలే సురేష్‌బాబు, ఆర్సీఎం యూత్ పాల్గొన్నారు.

పెనమలూరులో..

పెనమలూరు: పెనమలూరు మండలంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. కానూరు కార్మెల్‌మాత పుణ్యక్షేత్రం విచారణ ఫాదర్ చాలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో పోరంకి సాలిపేట నుంచి బందరు రోడ్డు, పోరంకి, తాడిగడప, కామయ్యతోపు మీదుగా కానూరు కార్మెల్ పుణ్యక్షేత్రం వరకు ఏసు క్రీస్తు కఠోర శ్రమను 14 స్థలముల సజీవ స్లీవమార్గం(సిలువమార్గం) భక్తిశ్రద్ధలతో జరిగింది. పుణ్యక్షేత్రంలో దివ్యబలి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్లు దేవదానం, రత్నారాజ్, భక్తులు పాల్గొన్నారు. పోరంకి, పెనమలూరు, యనమలకుదురు, వణుకూరు గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. గుడ్ ఫ్రైడే సందర్భంగా పోరంకిలో శుక్రవారం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. బందరు రోడ్డుపై సిలువ మార్గంలో భాగంగా భక్తులు ప్రదర్శనగా వెళ్లిన సమయంలో రావిశెట్టి దుర్గాప్రసాద్, అక్కిదాసరి రవి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పెద్ద అవుటపల్లి తంబి పుణ్యక్షేత్రంలో రెక్టర్ ఫాదర్ జోసఫ్ పాలడుగు నేతృత్వంలో విచారణ ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత గ్రామ పురవీధుల్లో సిలువ మార్గం నిర్వహించారు. ఏసుక్రీస్తు 14 స్థలాల సిలువ ఘట్టాన్ని విశ్వాసులు వేషధారణలో కళ్లకు కట్టినట్లు చూపించారు. ఉంగుటూరు, తేలప్రోలు, మానికొండ, ఇందుపల్లి తదితర గ్రామాల్లో ఆర్‌సీఎం సంఘస్తులు సిలువ మార్గాన్ని నిర్వహించారు. అలాగే పలు సంఘాల క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థన, ఆరాధనలు చేశారు. సిలువ యాత్రలో పెద్ద సఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చిక్కవరం, ముస్తాబాద, కొండపావులూరు, కట్టుబడిపాలెం తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి సిలువను మోశారు. క్రీస్తు సిలువలో పలికిన మాటలు క్రైస్తవ మార్గంలో నడుస్తున్న వారికి ఆధ్యాత్మిక సత్యాలు నేర్పిస్తాయని బోధకులు సూచించారు.

గన్నవరం: మండలంలోని క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక ఆర్‌సీఎం బాలయేసు దేవాలయం ఆధ్వర్యంలో సిలువ మార్గం ప్రదర్శన నిర్వహించారు. విచారణ గురువులు పసల థామస్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో భక్తులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేసరపల్లి, అజ్జంపూడి గ్రామాల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా సిలువ ప్రదర్శన చేశారు.



గన్నవరంలో విశ్వాసుల ప్రదర్శన



ముస్తాబాదలో సిలువ మార్గంలో భక్తులు



పెద్ద అవుటపల్లిలో సిలువ యాత్ర



పోరంకిలో ఏసుక్రీస్తు స్లీవమార్గంలో పాల్గొన్న భక్తులు

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్ సమక్షంలో పార్టీలో చేరిన శివయ్య, ఇతర నేతలు



సురేష్‌బాబును పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి జోగి రమేష్

గన్నవరం: బాపులపాడు మండలం కె.సీతారామపురం గ్రామానికి చెందిన టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నుబోయిన శివయ్య నేతృత్వంలో ఆ పార్టీకి చెందిన 60 మంది నేతలు, కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అందరూ కలిసికట్టుగా పార్టీ విజయానికి పని చేయాలని వంశీ పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్ష, కన్వీనర్లు నక్కా గాంధీ, అవిర్నేని శేషగిరిరావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పడకల వీర్రాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు మూల్పూరి ప్రభుకాంత్, మాజీ సర్పంచి మాయర వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు ఉమామహేశ్వరరావు, జక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, నున్న గ్రామ మాజీ సర్పంచి కర్రె విజయ్‌కుమార్ విజయవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో శుక్రవారం చేరారు. గన్నవరంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ విజయ్‌కుమార్‌కు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, మాజీ ఉప ఎంపీపీ శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచి బీ శివరామిరెడ్డి, బొంతు సాంబిరెడ్డి, హనుమ, నాగరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జోగి రమేష్ సమక్షంలో..

కంకిపాడు: నెప్పల్లి గ్రామానికి చెందిన అసిలేటి సురేష్‌బాబు(బాలస్వామి), పలువురు యువత శుక్రవారం గంగూరులోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి జోగి రమేష్ యువతకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పాటుపడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఇంటింటికీ తెలియజెప్పి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ప్రతిపక్షాల ఎత్తులను చిత్తు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, నెప్పల్లి నాయకులు రాయసం వెంకటరమణ, కొండవీటి సత్యనారాయణ, పానుగుమాటి వెంకటేశ్వరరావు, ఈడుపుగంటి రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలోని వేంపాడు గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. గన్నవరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి, కన్వీనర్ గుడిసే బాలస్వామి, వేంపాడు పీఏసీఎస్ చైర్మన్ నాగనబోయిన సోమేశ్వరరావు, గ్రామ కన్వీనర్ శివశంకర్, నాయకులు నాగరాజు, ఆళ్ల పోతిరెడ్డి, సునీల్‌రెడ్డి, బొప్పన సీతారామరాజు, శీమయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి రూరల్‌లో వంశీ ఎన్నికల ప్రచారం

రామవరప్పాడు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ విజయవాడరూరల్ మండలంలో శనివారం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారని గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో ఉదయం ఏడు గంటలకు ఎన్నికల ప్రచారాన్ని వంశీ ప్రారంభించనున్నారని వెల్లడించారు. శనివారం నుంచి ఏప్రిల్ నాలుగు వరకు ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు కాల్వగట్టు ప్రాంతాల్లో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. ఏప్రిల్ 5న నున్న, 6న పాతపాడు, 7న అంబాపురం, పి.నైనవరం, 8న నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో వంశీ పర్యటిస్తారని వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని వివరిస్తూ ఎన్నికల ప్రచారంలో ముందుకు సాగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, సొసైటీ చైర్మన్లు, సర్పంచ్‌లు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పార్కింగ్ కోసం స్థలాల పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దర్శనానికి విచ్చేసే భక్తుల వాహనాలను నిలుపుకొనేందుకు సరైన స్థలం కోసం పరిశీలన చేస్తున్నారు. దుర్గగుడి ఈఓ కెఎస్.రామరావు శుక్రవారం దుర్గాఘాట్, హెడ్ వాటర్ వర్క్స్ మధ్య ఉన్న స్థలంతో పాటు కుమ్మరిపాలెం సెంటర్‌లోని తిరుమల తిరుపతికి చెందిన స్థలాన్ని పరిశీలించారు. దుర్గాఘాట్ సమీపంలో ఉన్న స్థలాన్ని ఇప్పటికే దేవస్థానం వినియోగిస్తున్నందున అక్కడ నిల్వ చేసిన గ్రావెల్‌ను తరలించి వాహనాలను నిలిపేందుకు అనువుగా తీర్చిదిద్దే ఆలోచన చేస్తున్నారు. కనకదుర్గనగర్ నుంచి మహా మండపం వరకు అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో పాటు దుర్గాఘాట్‌లో అధిక సంఖ్యలో వాహనాలు నిలుపుకొనే అవకాశం లేకపోవడంతో పార్కింగ్ స్థలాలను పరిశీలిస్తున్నట్లు ఈఓ రామరావు పేర్కొన్నారు.

మంచి చేస్తున్న జగనన్నకు అండగా నిలుద్దాం

మంత్రి జోగి రమేష్



మంత్రి జోగి రమేష్‌కు ముద్దు పెడుతున్న చిన్నారి

ఉయ్యూరు: మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మండలంలోని కాటూరు గ్రామంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాజుపేట, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ప్రజలకు మంచి చేస్తున్న జగనన్నకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. మహిళలతో ప్రత్యేకంగా మాట్లాడారు. మహిళాభ్యున్నతికి రాజకీయాల్లో తీసుకొచ్చిన సంస్కరణలను తెలియజేశారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని వివరించారు. సంక్షేమ పాలనలో సీఎం జగన్ తీసుకొచ్చిన సంస్కరణలు దేశంలోని అనేక రాష్ట్రాలు అమలు దిశగా వెళ్తున్నాయని తెలిపారు. ప్రజలకు మంచి చేయడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదన్నారు. ఎల్లో మీడియా అండతో విష ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. పచ్చ కూటమి ఆటలు సాగనివ్వొద్దన్నారు. మంచి పాలన కొనసాగింపునకు సంక్షేమ పథకాల అమలుకు మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలో ఉండాలన్నారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. వలంటీరు, సచివాలయ వ్యవస్థ ద్వారా మంచి జరుగుతుందని పేర్కొన్నారు. పర్యటనలో ఎంపీపీ చీలి కల్పన, పార్టీ మండల అధ్యక్షుడు దాసే రవి, సర్పంచ్‌లు పానుగుమాటి బాలస్వామి, తుమ్మూరు సురేష్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యురాలు బందెల జ్యోతి, నాయకులు ఆరేపల్లి రజనీకాంత్, కాటూరు కిషోర్, బందెల పాల్, కొండూరి ఆనంద్, కొడాలి నాగయ్య, తోట శ్రీనివాసరావు, కొడాలి అఖి, బందెల చిన్ను, బందెల మధు, చీలి జనార్ధన్‌రావు, తవిడి డానియేలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలి




విజయవాడరూరల్ మండల నేతలతో ఎమ్మెల్యే అభ్యర్థి వంశీమోహన్

గన్నవరం: పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ఆ పార్టీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం విజయవాడరూరల్, ఉంగుటూరు మండలాల పార్టీ నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీమోహన్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున్న సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలను మార్చిందని తెలిపారు. నివేశన స్థలాల పంపిణీ ద్వారా లక్షలాది పేద కుటుంబాలకు శాశ్వత గూడు కల్పించిందని చెప్పారు. ప్రజలకు ఇంతటి మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీకి అన్ని వర్గాలు మద్దతుగా నిలవాలని కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పేదలకు–పెత్తందారులకు మధ్య యుద్ధం జరగనుందని చెప్పారు. ఈ సంగ్రామంలో పేదల పక్షపాతిగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి వంశీమోహన్‌ను ప్రజలు గెలిపించాలని కోరారు. ఎన్నికల ముందు వచ్చిపోయే యార్లగడ్డ వెంకట్రావు లాంటి వలస పక్షులను నమ్మి మోసపోవద్దని జెడ్పీటీసీ సభ్యుడు కాకర్లమూడి సువర్ణరాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అండగా నిలిచే వంశీమోహన్‌ను వరుసగా మూడోసారి గెలిపించాలని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ కోరారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఆర్‌వీఆర్, పార్టీ మండల అధ్యక్షుడు శీలం రంగారావు, గ్రామ అధ్యక్షులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తే సహించేది లేదు

కంకిపాడు: జాతీయ రహదారులపై ర్యాష్ డ్రైవింగ్, స్టంట్స్ చేస్తే సహించేది లేదని ఎస్ఐ డి.సందీప్ హెచ్చరించారు. మండలంలోని పునాదిపాడు సరీ్వసు రోడ్డులో పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. జాతీయ రహదారిపై స్టంట్స్ చేస్తున్న ఆరుగురు యువకులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద ఉన్న మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ, వాహనదారులను భయాందోళనలకు గురి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. యువత తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ భక్తులకు మజ్జిగ పంపిణీ



భక్తులకు మజ్జిగను పంపిణీ చేస్తున్న ఈఓ రామరావు, ఈఈ రమా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ఈఓ రామారావు ప్రారంభించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం ఎదుట దేవస్థాన ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయం భక్తులకు మజ్జిగ పంపిణీ జరుగుతుంది. తొలి రోజైన శుక్రవారం ఆలయ ఈఓ రామరావు కుటుంబం పేరిట 5 క్యాన్‌ల మజ్జిగను భక్తులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఈఓ రామరావు మాట్లాడుతూ ప్రతి ఏటా ఉగాది పర్వదినం నుంచి ఆలయ ప్రాంగణంలో మజ్జిగ వితరణ చేస్తామని, అయితే ఈ ఏడాది ముందుగానే ఎండల తీవ్రత అధికం కావడంతో మజ్జిగ పంపిణీ ప్రారంభించామని చెప్పారు. అమ్మవారి దర్శనం పూర్తి చేసుకుని బయటకు వచ్చే వారికి మజ్జిగను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రమాదేవి, ఏఈ కుటుంబరావు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నేడు కంకిపాడులో ఇంటింటి ప్రచారం

కంకిపాడు: కంకిపాడు పట్టణంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు ఏఎంసీ వైస్‌చైర్మన్ మాదు వసంతరావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ఆరోగ్యమాత ఆసుపత్రి ప్రాంతం నుంచి ఇంటింటి ప్రచారం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొంటారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బైక్ చోరీపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బైక్ చోరీపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. రాజీవ్‌శర్మనగర్‌కు చెందిన షేక్. సమీర్ చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో మటన్ షాపు నడుపుతుంటాడు. సమీర్ తన అవసరాల కోసం 2018లో పల్సర్ బైక్‌ను కొనుగోలు చేసి వినియోగిస్తుంటాడు. ఈ నెల 16వ తేదీ రాత్రి 11 గంటలకు సమీర్ తన బైక్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు తెల్లవారుజామున నిద్ర లేచి చూసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.